క్లుప్తంగా

కొనసాగుతున్న మట్టి తవ్వకాలు



కైకరం ఆయకట్టులో మట్టి తవ్వకాలు జరుగుతున్న దృశ్యం

ఉంగుటూరు: మండలంలో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. మండలంలోని మెట్ట ప్రాంతంతో పాటు డెల్టాలో కూడా తవ్వకాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఈ తవ్వకాలపై రెవెన్యూ అధికారులకు తెలిసినా తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. పొలాల్లో ఎత్తు పల్లాలు సరిచేసుకునే పనులు చేసుకుంటున్నారనే ముసుగులో ఈ మట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. కై కరం, చేబ్రోలు, ఉంగుటూరు , వెల్లమిల్లి, నాచుగుంట, నీలాద్రిపురం, గొల్లగూడెం తదితర ప్రాంతాల్లో మట్టి తవ్వకాలు అధికంగా జరుగుతున్నాయి.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ ఫలితాలు



చిలకంపాడు యూపీ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందిస్తున్న సర్పంచ్

గణపవరం: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన బోధన జరుగుతుందని, తద్వారా ఉత్తమ ఫలితాల సాధన సాధ్యమవుతుందని గణపవరం మండలం చిలకంపాడు సర్పంచ్‌చుక్కా అప్పారావు, ఎంపిటిసి సభ్యుడు పెచ్చెట్టి నర్సింహమూర్తి అన్నారు. గ్రామంలోని యూపీ పాఠశాలలో పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలతోపాటు ఉన్నత అర్హతలు కలిగిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారని, విద్యార్థులకు ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు.

నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్యకు అభినందనలు

దెందులూరు: ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా విధి నిర్వహణలో సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు, కేంద్ర సాయుధ బలగాలను సమన్వయం చేసుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా కృషి చేసిన నూజివీడు డీఎస్పీ కే.లక్ష్మయ్యను జిల్లా ఎస్పీ డీ.మేరీప్రశాంతి గురువారం అభినందించి ప్రశంసాపత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ తాను బాధ్యతలు నిర్వహించిన డివిజన్‌లో ప్రశాంతంగా ఎన్నికలు జరగడం, జిల్లా ఎస్పీ ప్రశంసించడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు డివిజన్‌లో సీఐలు, ఎస్ఐలు, ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు, కేంద్ర సాయుధ బలగాల కృషి ఉందన్నారు. దెందులూరు ఎస్ఐ కే.స్వామి, హెడ్‌కానిస్టేబుల్ హమీద్, గోపి, రామ్మోహన్, తదితరులున్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు గురువారం రూ. 1,01,116 విరాళంగా అందజేశారు. విజయవాడకు చెందిన కుదరవల్లి వెంకటకృష్ణమూర్తి ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు.

మహిళపై కేసు

ఏలూరు టౌన్: చట్ట విరుద్ధంగా అక్రమ మార్గంలో ఓ బిడ్డను దత్తత తీసుకున్న మహిళపై త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. నగర శివారు వట్లూరుకు చెందిన సాయిభవానీ ప్రసన్నకు పిల్లలు లేకపోవటంతో గుంటూరుకు చెందిన ఓ మహిళ వద్ద 13 నెలల క్రితం రూ.20 వేలు ఇచ్చి బిడ్డను కొనుగోలు చేసింది. ఆ బిడ్డకు సతీష్ అనే పేరు పెట్టి పెంచుకుంటోంది. ఈ క్రమంలో వట్లూరుకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తకు విషయం తెలియటంతో శిశుసంరక్షణ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో చైల్డ్‌లైన్ సిబ్బంది గురువారం ఆ బిడ్డను స్వాధీనం చేసుకుని శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. చైల్డ్ వెల్ఫేర్ శాఖ అధికారి జాహ్నవి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు గురువారం సాయి భవానీ ప్రసన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేకాట స్థావరంపై దాడి

జంగారెడ్డిగూడెం: పేకాట స్థావరంపై జంగారెడ్డిగూడెం పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. మండలంలోని అక్కంపేట గ్రామ శివారులో దాడులు నిర్వహించి 8 మందిని అరెస్టు చేసి, వీరి వద్ద నుంచి రూ.7,280 నగదును స్వాధీనం చేసుకున్నట్లు హెచ్‌సీ ఎన్. ఉమ తెలిపారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఒక వ్యక్తిని ముగ్గురు వ్యక్తులు కొట్టి గాయపర్చిన నేరంపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ నెల 17న శ్రీనివాసపురానికి చెందిన తగరం నాగరాజు అతని ఇంటి వద్ద ఉన్న సమయంలో పాలకుంట మహేష్, మరో ఇద్దరు కలిసి దాడి చేశారన్నారు. గాయపడిన నాగరాజు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం, నాగరాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

కోళ్ల వ్యర్థాలను చేపల మేతగా వినియోగిస్తే కఠిన చర్యలు



లింగంపాడులోని ఆక్వా చెరువులను పరిశీలిస్తున్న అధికారులు

భీమడోలు: ఆక్వా చెరువుల యాజమానులు కోళ్ల వ్యర్థాలను మేతగా వినియోగిస్తే వాటి అనుమతులు రద్దు చేస్తామని భీమడోలు తహసీల్దార్ జి.వర హలయ్య అన్నారు. భీమడోలు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఇటీవల కొల్లేరు, ఇతర ప్రాంతాల్లోని చేపల సాగుకు యథేచ్ఛగాగా కోళ్ల వ్యర్థాలను ఆక్వా రైతులు వినియోగిస్తున్న నేపథ్యంలో మండల స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. తహసీల్దార్ జి.వరహలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి భీమడోలు ఎస్సై వై.సుధాకర్, రెవెన్యూ, ఆటవీ, మత్స్యశాఖ అధికారులు హాజరయ్యారు. మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను, ఆగడాలలంక, అంబర్‌పేట తదితర రెవెన్యూ గ్రామాల్లో ఆక్వా రైతాంగం కోళ్ల వ్యర్థాలను వినియోగించడంపై సమావేశంలో వివిధ శాఖల అధికారులు చర్చించి పలు అంశాలపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలను తరలించే వాహనాలను సీజ్ చేయడంతో పాటు చెరువుల అనుమతులను రద్దు చేస్తామని హెచ్చరించారు. వ్యర్థాలను చేపలకు మేతగా వాడడం వల్ల పర్యావరణానికి పెనుముప్పుగా మారుతుందని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడడమేనన్నారు. కోళ్ల వ్యర్థాలను వినియోగిస్తే పక్కనే ఇతర సాగుకు తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. ఆక్వా రైతులు తమ అనుమతుల మేరకు సాగు చేయాలే తప్ప నిబంధలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లోని వీఆర్వోలు, పోలీసులు, ఇతర శాఖాల నిఘా పెట్టాలని, ఎంతటి వారిపైనే కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో కోళ్ల మాంస విక్రయ వ్యాపారులకు నోటీసులు జారీ చేసామని పేర్కొన్నారు. అనంతరం భీమడోలు పంచాయతీ శివారు లింగంపాడు ఏరియాలో ఆక్వా చెరువులను పరిశీలించారు. రైతులకు తగు సూచనలందించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖాధికారి ఎస్.దుర్గాదేవి, డెప్యూటీ తహసీల్దార్ షంషాద్దీన్, ఆర్ఐ కిరణకుమారి, అటవీశాఖ ఏబీవో శ్రీనువాస్ బాబు తదిరతరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత



చేబ్రోలు బాలికల హైస్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: మండంలోని చేబ్రోలులో గురువారం పుస్తకాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బాలికల హైస్కూల్‌లో, ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రందే లక్ష్మీసునీత, ఎంపీటీసీ-1 సభ్యురాలు రాయి లక్ష్మి, ఎంపీటీసీ -2 సభ్యురాలు మనసాల నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అవార్డుతో బాధ్యత పెరిగింది



జిల్లా అధికారులతో అవార్డు అందుకుంటున్న ల్యాబ్ టెక్నీషియన్ సెరా (ఫైల్)

బుట్టాయగూడెం: అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందని ల్యాబ్ టెక్నీషియన్ బొల్లపో సెరా తెలిపారు. పెనుగొండ ప్రభుత్వాస్పత్రిలో తాను అందించిన సేవలకుగాను ఇటీవల పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ జి.సుమిత్ కుమార్, డాక్టర్ భాను నాయక్‌ల చేతుల మీదుగా సత్కారం పొందినట్లు చెప్పారు. పెనుగొండ నుంచి బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రానికి మూడేళ్లక్రితం బదిలీపై వచ్చిన తాను రోజుకు కనీసం 4 వేలకు పైగా అన్నిరకాల టెస్టులు చేస్తున్నానని తెలిపారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలుగకుండా టెస్టులు చేసి వైద్యులకు రిఫర్ చేస్తున్నట్లు చెప్పారు. తాను అందుకున్న అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తానని చెప్పారు.

యోగాతో ఒత్తిడులు దూరం

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం



కొప్పాక పాఠశాల్లో యోగాసనాలు వేస్తున్న చిన్నారులు

పెదవేగి : యోగాతో శారీరక, మానసిక ఒత్తిడుల నుంచి ఉపశమనం పొందవచ్చునని వ్యాయామ ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. అంతర్జాతీయంగా యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించేందుకు మండలంలో ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మండలంలోని కొప్పాక, విజయరాయి, పెదవేగి, గార్లమడుగు ఓరియంటల్ హైస్కూల్, దుగ్గిరాల సెయింట్ జోసఫ్ దంత కళాశాలలో, భోగాపురం విజ్ఞాన్ గ్లోబల్‌జెన్, పెదవేగి ఎస్ఎంసీ పాఠశాలల్లో యోగా దినోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు యోగాసనాలపై ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. ప్రాణాయామం, వజ్రాసనం, శేషాసనం, నౌకాసనం, వయూరాసనం, కుక్కుటాసనం వంటి ఆసనాలు, వాటి ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. అన్నీ వయస్సుల వారు యోగాసనాలు తప్పక వేయాలని, ఇది దీర్ఘకాలిక రోగాలకు మంచి ఉపశమనమేకాక, శారీరక, మానసిక ఒత్తిడుల నుంచి బయటపడవచ్చని సూచిస్తున్నారు.

విలువలతో కూడిన విద్య అందించాలి



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

పెదపాడు: విలువలతో కూడిన విద్యను అందించాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఉపాధ్యాయులకు సూచించారు. పెదపాడు మండలంలోని అప్పనవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాలలో అన్ని వసతులు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. నాణ్యమైన విద్యను అందించాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యు రాంప్రసాద్, గారపాటి రామసీత, మోరు శ్రావణి, లావేటి శ్రీనివాసరావు, ఎంఈఓలు సబ్బితి నర్సింహమూర్తి, డీవీ రమణ, ప్రధానోపాధ్యాయురాలు టీ పుష్పావతి పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అదిరోహించాలి

పెదవేగి : ప్రభుత్వ సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం కొప్పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో గురువారం జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ అబ్రహంతో కలసి ఎమ్మెల్యే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు సంబంధిత కిట్‌లను పంపిణీ చేశారు. పాఠశాల్లో 3వ తరగతి నుంచి 12 తరగతి వరకు మొత్తం 573 విద్యార్థులకు కిట్‌లను పంపిణీ చేసినట్లు ఎంఈఓ సీహెచ్ బుద్ధవాస్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ2 వీ అరుణ్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు బొప్పన సుధా, హెచ్‌ఎం ఆర్ శైలజ, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులు సమష్టిగా ఉంటే అధిక ప్రయోజనాలు



మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ అఖిలభారత రోజ్‌గార్ ప్రముఖ్ కుమార్ స్వామి

ఉంగుటూరు: రైతులు వ్యక్తిగతంగా సాధించలేనిది సంఘటితంగా సాధించుకోవచ్చని రైతు పండించిన ఉత్పత్తులు కూడా విక్రయాలు గిట్టుబాటు ధరకు అమ్ముకోవచ్చని అఖిల భారత రోజ్‌గార్ ప్రముఖ్ భారతీయ కిసాన్ సంఘ్ కుమార స్వామి అన్నారు. ఉంగుటూరులో స్వర్ణ హాలిక రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏర్పాటు చేసిన సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ రైతు పండించిన ఉత్పత్తులకు సంస్థ ద్వారా మంచి లాభాలు వస్తాయని, అలాగే దీనికి కేంద్ర ప్రభుత్వం సహకారం కూడా అందిస్తోందని వివరించారు. ఈ సంస్థను ఎలా నడపాలో తెలియజేశారు. ఈ సభలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ షేక్ హబీబ్ బాష మాట్లాడుతూ రైతులు సంఘటితంగా ఉండటం ద్వారా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. శాఖాపరంగా తాము కూడా సహకరిస్తామని అన్నారు. ఈ సమావేశంలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు పరిమి రాఘవులు, నారాయణ సేవా సమితి అధ్యక్షులు బి.సుజయ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి బాలిన వెంకటేష్, వ్యవసాయ శాఖ ఏడీఏ ఉషా రాజకుమారి, ఉంగుటూరు ఎఫ్‌పీవో చైర్మన్ కడియాల ప్రేమసాయి తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ హాలిక డైరెక్టర్‌లు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్‌లు కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, పాతూరి విజయ్‌కుమార్, ఉపసర్పంచ్ పాతూరి జగదీష్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ క్యాలెండర్ ప్రకారం పాఠ్యాంశాల బోధన



బువ్వనపల్లి ప్రీహైస్కూలులో విద్యార్థుల నోట్సు తనిఖీ చేస్తున్న ఎంఈఓ రాంబాబు

నిడమర్రు: ఉపాధ్యాయులు ప్రభుత్వం అందించిన క్యాలెండర్ ప్రకారం పాఠ్యాంశాల బోధన జరపాలని నిర్ణీత సమయం ప్రకారం సిలబస్ పూర్తి చేయాలని నిడమర్రు ఎంఈవో కె.రాంబాబు ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం ఆయన బువ్వనపల్లి ప్రీహైస్కూలును తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పరిశీలించారు. ఉచిత పాఠ్య, నోటుపుస్తకాల పంపిణీ తీరును పరిశీలించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మొత్తం విద్యార్థులంతా మధ్యాహ్న భోజనం చేసేలా ప్రోత్సహించాలని హెచ్‌ఎం ఎస్.ఏసుబాబుకు సూచించారు. నూతన అడ్మిషన్స్‌పై ఆరా తీశారు.

రెవెన్యూ శాఖపై అపోహలను తొలగించాలి



గణపవరంలో విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

గణపవరం: రెవెన్యూ సేవలను ప్రజలకు సులభతరంగా అందించడానికి రెవెన్యూ సిబ్బంది కృషి చేయాలని, ప్రజలలో రెవెన్యూ శాఖపై ఉన్న అపోహలు తొలగించుకోవాలని గణపవరం తహసీల్దార్ వై.రాంబాబు అన్నారు. గురువారం జాతీయ రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని గణపవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీనియర్ రెవెన్యూ ఉద్యోగుల క్రొవ్విడి విశారద, ప్రకాష్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూశాఖ మిగిలిన అన్ని శాఖల కన్నా ఎంతో ప్రాధాన్యత కలదని, ప్రజలకు నిత్యం రెవెన్యూశాఖతో సంబంధాలు ఉంటాయన్నారు. ప్రజలకు అవసరమైన రెవెన్యూ సేవలను సకాలంలో అందించి ప్రజల అభిమానం పొందాలని సిబ్బందికి సూచించారు. సీనియర్ రెవెన్యూ అధికారి విశారద మాట్లాడుతూ రెండున్నర శతాబ్దాల క్రితం పుట్టిన రెవెన్యూ శాఖ నిత్యం ప్రజలతో మమేకమై ఎంతో కీలకంగా మారిందన్నారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది విశారద, ప్రకాష్‌లను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈకార్యక్రమంలో డీటీ పోతురాజు, మండల వీఆర్‌ఓల సంఘం అధ్యక్షుడు కేశవమూర్తి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకూ ఆందోళన



రాజమండ్రి సీపీఎఫ్ కంపెనీ వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులతో చర్చిస్తున్న పోలీసులు

గణపవరం: గణపవరం సీపీఎఫ్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు న్యాయం జరిగే వరకూ ఆందోళన కొనసాగిస్తామని కంపెనీ ఉద్యోగులు ప్రకటించారు. తమకు న్యాయం చేయాలని, నియామక సమయంలో కంపెనీ యాజమాన్యం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ గురువారం ఉద్యోగులు రాజమండ్రిలోని సీపీఎఫ్ కంపెనీ గేటు ముందు రెండో రోజు ఆందోళన నిర్వహించారు. రాజమండ్రి పోలీసులు ఆందోళన చేస్తున్న ఉద్యోగులవద్దకు వచ్చి చర్చలు జరిపారు. ఉద్యోగులు తమ కోర్కెలను తెలియచేయగా పోలీసులు యాజమాన్యంతో చర్చించారని, అయితే యాజమాన్యం సానుకూలంగా స్పందించలేదని ఉద్యోగ సంఘ నాయకులు తెలిపారు. తమకు న్యాయం జరిగేవరకూ ఆందోళన కొనసాగిస్తామని, త్వరలోనే ఆమరణ నిరాహారదీక్ష కార్యక్రమం చేపడతామని ప్రకటించారు. తమ డిమాండ్‌లు నెరవేర్చాలని, కంపెనీని తిరిగి ప్రారంభించాలని వారు నినాదాలు చేశారు.

సీతంపేట కాల్వలో పూడిక మట్టి తొలగింపు

దెందులూరు: సీతంపేట కాల్వలో పూడిక మట్టిని తొలగించే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కాల్వ ఆయకట్టు పరిధిలో 5 వేల ఎకరాలు సాగు జరుగుతుంది. ఇక్కడ అండర్ పాస్ నిర్మాణం వల్ల కాల్వలో మట్టి వేయడంతో ఆయకట్టు చివరి గ్రామాల పొలాలకు సాగునీరు వెళ్లని పరిస్థితి. దీనిపై ఆయకట్టు రైతులు ఇరిగేషన్ డివిజనల్ ఇంజనీర్ కొడాలి బాబుకు వివరించడంతో ఆయన ఈ విషయాన్ని రైల్వే అధికారులకు తెలియజేశారు. దీనిపై రైల్వే అధికారులు స్పందించి సీతంపేట కాల్వలో పూడికమట్టిని తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రైతు నాయకులు వీరమాచినేని శివాజీ, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గారపాటి కొండయ్యచౌదరి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఇప్పిలి వెంకటేశ్వరరావు, ఆయకట్టు రైతులు రైల్వే అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల సహకారంతోనే సంపూర్ణ పారిశుద్ధ్యం

దెందులూరు: గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు వేగంగా జరుగుతున్నాయని గ్రామ సర్పంచ్ ఇంటేటి మధులత, గ్రామ కార్యదర్శి రంగనాయకమ్మ అన్నారు. గురువారం గ్రామంలోని శ్రీనివాసరావుపేట ఇతర ప్రాంతాల్లో చెత్త తొలగించడం, డ్రెయిన్లు శుభ్రం చేయడం, బ్లీచింగ్ చల్లించడం వంటి పనులను పారిశుద్ధ్య సిబ్బంది నిర్వహించారు. గ్రామంలో వ్యక్తిగత, సామూహిక పరిశుభ్రత ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఒక్కరూ ఇళ్లు, షాపుల వద్ద డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకుని ఉపయోగించాలని గ్రామ కార్యదర్శి రంగనాయకమ్మ కోరారు. గ్రామ కార్యదర్శి సత్యనారాయణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ హరీష్, బిల్లు కలెక్టర్ సుబ్బారావు పాల్గొన్నారు.

యువతీ యువకులకు కంప్యూటర్, టైలరింగ్ శిక్షణ

దెందులూరు: గ్రామ శివారు ప్రాంతాల్లో యువతీ, యువకులకు స్వయం ఉపాధి, వృత్తి విద్యా కోర్సుల్లో నైపుణ్యం కల్పించడం సెయింట్ ఫ్రాన్సిస్ ట్రెనింగ్ సెంటర్ లక్ష్యమని బ్రదర్ జోసెఫ్‌కుమార్ అన్నారు. గురువారం గోపన్నపాలెం సెయింట్ ఫ్రాన్సిస్ ట్రెనింగ్ సెంటరులో టైలరింగ్, కంప్యూటర్ డిజిటల్ ఫోటో షాప్‌పై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల పాటు ఈ రెండింటిలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. రూ.800 ప్రవేశరుసుము చెల్లించి ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని బ్రదర్ జోసెఫ్ కుమార్ కోరారు.

దివ్యాంగుల నిర్ధారణ శిబిరాలను వినియోగించుకోండి



ఉపకరణాల పంపిణీ కోసం లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న దృశ్యం

దచింతలపూడి: దివ్యాంగుల నిర్ధారణ వైద్య శిబిరాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు అధికారి బి సోమశేఖర్ విజ్ఞప్తి చేశారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద గురువారం జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఉపకరణాల పంపిణీ కోసం లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అవసరాలు కలిగిన 6 నుంచి 18 సంవత్సరాలు నిండిన బాల, బాలికలు, వారి తల్లి,దండ్రులు శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి సోమశేఖర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న భవిత కేంద్రాల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు అందరూ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వం అందించే ఉపకరణాలను వినియోగించుకోవాలని కోరారు. శిబిరంలో చింతలపూడి, లింగపాలెం, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం మండలాల నుంచి 136 మంది బాల, బాలికలను గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ బి భాస్కరరావు, హెచ్‌ఎం మురళీకృష్ణ, నాలుగు మండలాల విద్యాశాఖాధికారులు, ఐఈఆర్‌టీలు పాల్గొన్నారు.

చుట్టల కార్మికులను ప్రభుత్వమే ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): చుట్టల కార్మికులను రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకోవాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ అనుబంధ చుట్టల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక చొడిదిబ్బ పెద్దరామాలయం వీధిలో ఉన్న కమ్యూనిటీ హాలులో జనరల్ బాడీ సమావేశం వి.చంటి అధ్యక్షతన నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఐఎఫ్‌టీయూ నగర నాయకులు గడశాల రాంబాబు, మంగం అప్పారావు మాట్లాడారు. నగరంలో వందలాదిగా పనిచేస్తున్న చుట్టల కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. రెండేళ్లకోసారి జరిగే వేతన ఒప్పందం విషయంలో టుబాకో మర్చంట్స్ మ్యానిఫ్రాక్చర్స్ అసోసియేషన్ చొరవ తీసుకుని కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం చేయాలని కోరారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతన ఒప్పందం చేయాలన్నారు. కూలీ రేట్లు పెంపుదల కోరుతూ ఈ నెల 25న యజమానులకు వినతిపత్రం అందజేయాలని జనరల్ బాడీ తీర్మానించింది. సమావేశంలో ఎం.లక్ష్మి, కృష్ణవేణి, మహాలక్ష్మి, హైమావతి, వెంకటలక్ష్మి, సూరిబాబు, బాలయ్య తదితరులు ఉన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జంగారెడ్డిగూడెం: రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 29వ తేదీన జంగారెడ్డిగూడెం కోర్టు నందు నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జంగారెడ్డిగూడెం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) సీహెచ్ కిషోర్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లోక్ అదాలత్‌లో అన్ని రకాల రాజీ పడదగ్గ సివిల్, క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, కుటుంబ తగాదా కేసులు, ప్రీ లిటిగేషన్ (బ్యాంకు, బీఎస్ఎన్ఎల్) కేసులు పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. జాతీయ లోక్‌అదాలత్‌లో ఈ కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయాన్ని, డబ్బుని ఆదా చేసుకోవచ్చన్నారు. కక్షిదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. న్యాయవాదులు, పోలీసులు కక్షిదారులకు జాతీయ లోక్‌అదాలత్‌పై అవగాహన కల్పించి ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా కృషి చేయాలన్నారు. అంతేకాకుండా సుప్రీంకోర్టులో పెండింగ్ ఉన్న కేసుల పరిష్కారానికి జూలై 27 నుంచి ఆగస్టు మూడో తేదీ వరకు ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు. వర్చువల్ విధానంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు నిర్వహించే లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జాబ్‌మేళాలో 25 మంది ఉద్యోగాలకు ఎంపిక

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ మేళాలు నిర్వహించి తద్వారా వారికి ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషి చేస్తామని ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ తెలిపారు. మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏ వైటీసీలో గురువారం ఏజెన్సీ ప్రాంతంలోని 5 మండలాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్‌మేళా నిర్వహించారు. తిరుపతి శ్రీసిటీలోని మోండెలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ డాట్ లిమిటెడ్ (ఫార్మర్లీ కాడ్బరీ ఇండియా లిమిటెడ్), అపోలో టైర్స్ వారి ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా నిర్వహించినట్లు పీవో చెప్పారు. ఈ జాబ్‌మేళాలో 25 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీడీ ఎం.నాగేశ్వరరావు, పీఎంఆర్‌సీ ఏఎంఓ శిరమయ్య, కమ్యూనిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ

ఏలూరు టౌన్: మేనల్లుడి శుభకార్యానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి బంగారు అభరణాలు చోరీ చేశారు. వివరాల ప్రకారం.. ఏలూరు వన్‌టౌన్ సత్యనారాయణపేటకు చెందిన మత్తి శ్రీనుబాబు తన మేనల్లుడి పుట్టిన రోజు వేడుకకు ఈనెల 18న ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా నరసాపురం వెళ్లాడు. తిరిగి గురువారం ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపు తాళాలు పగలకొట్టి ఉన్నాయి. కొన్ని బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి దోచుకుపోయారని బాధితుడు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన వృద్ధురాలు వీర్నాల కనకమ్మ (67) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. స్థానిక బావిశెట్టివారిపేటకు చెందిన కనకమ్మ ఈనెల 18 సాయంత్రం తన చిన్నకొడుకు ద్విచక్ర వాహనంపై పచారీ దుకాణానికి వెళ్లింది. తిరిగి వచ్చే క్రమంలో ద్విచక్ర వాహనం ఎక్కుతూ జారి కిందపడింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్రగాయం కాగా కుటుంబ సభ్యులు సర్వజన ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె గురువారం రాత్రి మృతిచెందింది.

నేడు ఆశ్రంలో యోగ కార్యక్రమం

ఏలూరు రూరల్ : ప్రపంచ యోగా డే సందర్భంగా శుక్రవారం ఉదయం 6 గంటలకు ఏలూరు ఆశ్రం వైద్యకళాశాల ఆవరణలో యోగా డే నిర్వహించనున్నట్లు ఆశ్రం యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమంలో యోగ సాధన వల్ల కలిగే ప్రయోజనాలతో పాటు వ్యక్తిగత, సమాజానికి జరిగే మేలును పలువురు యోగా సాధకులు వివరించనున్నట్లు తెలిపింది.